ప్రతి కార్యకర్త ఒక కథానాయకుడు కావాలి

పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి వేదికపై ఎన్నికల ఇన్‌చార్జి విజయసింహారెడ్డి

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివద్ధి చేస్తా
- బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించే సైదన్నకు మద్దతుగా నిలవాలి
- నియోజకవర్గ ఎన్నిక ఇన్‌చార్జి తిప్పన విజయసింహారెడ్డి

నేరేడుచర్ల, అక్టోబర్ 18 : బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, బూత్ స్థాయి కమిటీ మెంబర్లు గ్రామాల్లో ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వ పథకాలు వివరించాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎస్‌కేఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నేరేడుచర్ల మండల బూత్ స్థాయి కమిటీ సమావేశానికి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఆగ్రో చైర్మన్ తిప్పన విజయ సింహారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. 60ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు, ప్రజల బాధలు ఎలా ఉండేవో నేటి యువతరానికి వివరించాలని సూచించారు. తెలంగాణ రాకముందు పరిస్థితులు, వచ్చాక జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలిచ్చిన మెజార్టీతో నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తెచ్చి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మరోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గానికి మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు దొంగ ఎత్తులు వేస్తారని, వారిని గ్రామాల్లో కనిపెట్టాలన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ దొంగ ప్రచారం చేస్తున్నదని, దాన్ని తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు. గత ప్రభుత్వాల పాలనలో ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద బోకర్లు ఉండే వారిని ప్రస్తుతం అలాంటి వ్యవస్థ లేదన్నారు. చేసిన అభివృద్ధిని చెప్పి ప్రజలను ఓట్లు అడిగే దమ్మూ ధైర్యం సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. మెజార్టీ రావాలంటే బూత్ కమిటీ సభ్యులే కీలకమని, మీరందరూ ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. మీ మధ్య మనస్పర్థలు మర్చిపోయి అందరూ కలిసి పని చేయాలని కోరారు. నేరేడుచర్ల పట్టణ, మండల పరిధిలోని బూత్ కమిటీల్లో ఎక్కువ మెజార్టీ సాధించిన కమిటీకి లక్ష రూపాయల బహుమతి అందిస్తామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ ప్రకటించారు. సైదన్న గెలుపునకు అందరం కలిసి పని చేస్తామని సభాముఖంగా అక్కడికొచ్చిన శ్రేణులందరూ ప్రమాణం చేశారు.

ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

నేరేడుచర్లలో బూత్ కమిటీ సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన 200మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

ఢిల్లీలో ఉండే ఉత్తమ్ కావాలా... మీ మధ్య ఉండే సైదన్న కావాలా?

నియోజకవర్గానికి ఎప్పుడో ఒక సారి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే ఢిల్లీ గులామ్ ఉత్తమ్ కావాలా.. రాత్రి పగలు తేడా లేకుండా మీ మధ్యలో ఉండి పని చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కావాలో మీరే తెల్చుకోవాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తిప్పన విజయసింహారెడ్డి కార్యకర్తలను కోరారు. గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఈ సారి ఎక్కువ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఈసారి సైతం బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా హనమంతుడి ముందు కుప్పిగంతలు వేసినట్లేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు అరిబండి సురేశ్‌బాబు, కొణతం సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ లకుమళ్ల జ్యోతీభిక్షం, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు యల్లబోయిన లింగయ్య, చిత్తలూరి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ సోమగాని మురళి, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మాజీ జడ్పీటీసీ అన్నపురెడ్డి నారాయణరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు చింతకుంట్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శాఖమూరి శ్రీకాంత్, అనంతు శ్రీనివాస్, గరిడేపల్లి మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు ఎలిషా, సుదర్శన్, కౌన్సిలర్ సరిత పాల్గొన్నారు.

నేరేడుచర్ల సమావేశానికి హాజరైన కార్యకర్తలు

40రోజులు కష్టపడండి.. ఐదేండ్లు అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

పాలకవీడు, అక్టోబర్ 18 : వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు 40 రోజులు కష్టపడితే వారికి ఐదేండ్లు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. మండలంలోని జాన్‌పహాడ్ దర్గా గ్రామంలో బుధవారం నిర్వహించిన బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ అండదండలతో హుజూర్‌నగర్ నియోజక వర్గంలో 60ఏండ్లలో జరగని అభివృద్ధిని నాలుగేండ్లలో చేసి చూపించామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన పలుకుబడితోనే తనకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గంలో శానంపూడి సైదిరెడ్డిని 85వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆగ్రోస్ చైర్మన్, ఎన్నికల ఇన్‌చార్జి తిప్పన విజయసింహారెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు మలమంటి దర్గారావు డీసీసీబీ జిల్లా డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యరెడ్ల సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రవి నాయక్, నాయకులు వెంకట్‌రెడ్డి, మంద నాగయ్య, చినవీరారెడ్డి, రామారావు, దానయ్య, కృష్ణారెడ్డి, బోయబోయిన భిక్షం, సుమన్, బోగాల వీరారెడ్డి, షేక్ గౌస్, మునగాల సైదిరెడ్డి, సతీశ్, చందూనాయక్, లక్ష్మీనారాయణ, నరీనాయక్, వెంకటేశ్వర్లు, మహిళా నాయకులు మమత, అచ్చమ్మ పాల్గొన్నారు.

మేళ్లచెర్వులో

చిలుకూరులో

గరిడేపల్లిలో

హుజూర్‌నగర్‌లో

మహాలక్ష్మిగా దుర్గమ్మ

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం మహాలక్ష్మిగా, రాజరాజేశ్వరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారి పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్ వర్క్, అక్టోబర్ 18

ఇళ్లు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

అధైర్యపడొద్దు అండగా ఉంటా

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 18 : రోడ్డు విస్తరణలో భాగంగా కాల్వ కట్ట వద్ద ఇండ్లు కోల్పోయిన నిరుపేదలు అధైర్యపడవద్దని వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని 24వ వార్డు చింతల బజారులో బుధవారం పర్యటించి వారిలో నిర్వాసితుల్లో మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రతిపక్షాల మాయలో పడి పార్టీ ఫిరాయిస్తున్న వారిని పట్టించుకోకుండా ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న వారిని గుర్తించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్, కౌన్సిలర్ జక్కుల శంభయ్య, నాయకులు తండు సాయిరాం, ప్రదీప్, గోపినాథ్‌రెడ్డి, నాగరాజు, వీరారెడ్డి, మల్లయ్య, రవీందర్‌రెడ్డి, సైదులు, నరేశ్,రాము, నర్సింహారావు, కోళ్లపూడి చంటి, కాంత్రి పాల్గొన్నారు.

రమేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

కార్యకర్తల కుటుంబానికి అండగా బీఆర్ఎస్

సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి

మఠంపల్లి, అక్టోబర్ 18 : ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మఠంపల్లి గ్రామానికి చెందిన మాతంగి రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట గోలమారి ఆరోగ్యరెడ్డి, సురేశ్‌గౌడ్ ఉన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, అక్టోబర్ 18 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు గురువారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సర్వారంలో 20నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

గరిడేపల్లి, అక్టోబర్ 18 : మండలంలోని సర్వారం గ్రామంలో గల లక్ష్మీనరసింహ భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి ఏపీ రాష్ట్రస్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలిచిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.12,116, చతుర్థ బహుమతి రూ. 8,116, పంచమ బహుమతి రూ.6,116, షష్టి బహుమతిగా రూ.4,116 అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అన్ని విభాగాల్లో వ్యక్తిగత బహుమతులు సైతం అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు 9640346207 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మునగాలలో కనకదుర్గమ్మ జాతర రేపు

మునగాల, అక్టోబర్ 18 : దుర్గామాత జాతరను మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా కనకదుర్గమ్మ ఆలయాన్ని విద్యుదీపాతో అందంగా ముస్తాబు చేశారు. జాతర కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.